క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు



సింహాచలం: అడవివరం లోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు



కామ్రేడ్ అచ్యుతానందన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

పరవాడ: భారత కమ్యూనిస్ట్ యోధుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ మృతి వామపక్ష పార్టీలకు తీరని లోటని పరవాడ సిటు నాయకులు సంతాపం ప్రకటించారు. స్థానిక సినిమాహాలు కూడలిలో ఏర్పాటుచేసిన సంతాప కార్యక్రమంలో అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 102 ఏళ్ల నిండు జీవితం గడిపిన అచ్యుతానందన్ ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా ఉద్యమ జీవితానికి అంకితమయ్యారని పేర్కొన్నారు. 17 ఏళ్ల వయసులో సీపీఎంలో చేరి, దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కూలీల మధ్య ఉంటూ, వారిని సంఘటితం చేస్తూ పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సిటు నాయకులు పి.అప్పారావు, శ్రీను, నాయుడు, సత్తిబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



వాహనదారులతో ఎస్‌ఐ నరసింగరాజు

పెందుర్తి: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని పెందుర్తి ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.నరసింగరాజు సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదకరమని, పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. సోమవారం పెందుర్తి ప్రాంతంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం తలకు గాయాలు కావడం వలనే మరణాలు సంభవిస్తున్నాయని, అందుకే ద్విచక్ర వాహనదారులంతా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. లేదంటే భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు



యోగేశ్వరరావు

పెందుర్తి: వేపగుంట సమీపంలోని శానాతి వానిపాలెంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు పెందుర్తి పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. తటపూడి యోగేశ్వరరావు(29) నగరంలోని ఓ పేస్ట్రీ దుకాణంలో చెఫ్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం విధులకు అని బయటకు వెళ్లి, ఎంతకీ తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. భార్య గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపారు.

పెందుర్తి రెవెన్యూలో కూటమి బదిలీలాట!

- తహసీల్దార్లతో బంతాట ఆడుతున్న కూటమి 'ముఖ్య'నేతలు
- ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి రెండు నెలల్లో ముగ్గురి మార్పు
- అధికార జనసేన, టీడీపీ నేతల ఆధిపత్య పోరులో నలిగిపోతున్న యంత్రాంగం
- ఒక వర్గం చెప్పిన మాట వింటే అధికారులపై మరో వర్గం వీరంగం

'ఏం తహసీల్దార్.. నా ఫోనే తియ్యవా.. మా కార్యకర్త కట్టుకుంటున్న ఇంటినే కూల్చడానికి వెళతావా.. ఎంత ధైర్యం నీకు? నీ పనిచెప్తా' ఇటీవల తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి రెవెన్యూ అధికారులు, సిబ్బంది ముందే కూటమి ముఖ్యనేత తహసీల్దార్‌పై చేసిన వీరంగం ఇది..!

'ఏంటి వీఆర్వో.. మావాళ్లు చెప్పిన పనిచేయడం లేదంట. ఏమనుకుంటున్నావ్ నువ్వు. అధికార పార్టీ నాయకులమైన మాకంటే ఎక్కువా? ఒకసారి 'సార్' ఆఫీస్‌కు రమ్మన్నారు' అంటూ కిందిస్థాయి రెవెన్యూ అధికారులపై కూటమికి చెందిన మరో నేత ప్రధాన అనుచరుడి హూంకరింపు.



పెందుర్తి తహసీల్దార్ కార్యాలయం

పెందుర్తి తహసీల్దార్ చాంబర్

పెందుర్తి:

నియోజకవర్గంలోని అధికార కూటమికి చెందిన ముఖ్యనేతల ఆధిపత్య పోరులో పెందుర్తి మండల రెవెన్యూ విభాగం పూర్తిగా చిన్నాభిన్నమైంది. స్వేచ్ఛగా పనిచేసుకోవాల్సిన ఉన్నతాధికారులు, సిబ్బంది దినదిన గండంగా బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. 'ఏ పని చేస్తే ఏ సార్‌కు కోపం వస్తుందో' అన్న భయాందోళనలోకి యంత్రాంగం వెళ్లిపోయింది.

ప్రత్యర్థుల మధ్య పావులుగా..

కూటమిలో ఇద్దరు ముఖ్యనే తలతో పాటు కింది స్థాయి చోటామోటా కార్యకర్తల వరకు అధికారులపై తీవ్రస్థాయిలో పెత్తనం చలాయిస్తున్నారు. దీంతో రెవెన్యూ యంత్రాంగం అడకత్తెరలో పోకచెక్క మాదిరి నలిగిపోతోంది. చిరకాల ప్రత్యర్థులైన ఈ ఇద్దరి ఒత్తిళ్లకు జిల్లా ఉన్నతాధికారులే తలొగ్గుతుండడంతో అధికారులు మరింత భయపడుతున్నారు. వాళ్ల ఒత్తిళ్లకు లొంగి రెండు నెలల వ్యవధిలో ముగ్గురు తహసీల్దార్లను మార్చడంతో జిల్లా అధికారుల తీరుపై స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. అత్యంత ప్రాధాన్యత ఉన్న, పెద్ద రెవెన్యూ మండలానికి మరోసారి అడహాక్ తహసీల్దార్‌నే నియమించడంలో జిల్లా అధికారుల బేలతనం చూసి మేధావులు తలలు పట్టుకుంటున్నారు. ఇలా తరచూ రాజకీయ ఒత్తిళ్లతో అధికారులను మార్చేస్తుంటే సాధారణ ప్రజలకు అందాల్సిన సేవల్లో తీవ్ర జాప్యం, సేవా లోపం కనిపిస్తుందని ఆక్షేపిస్తున్నారు.

వెళ్లిపోతే బాగుండు..!

ఉమ్మడి విశాఖ జిల్లాలో పెందుర్తి రెవెన్యూ శాఖకు ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. గ్రామీణం, పట్టణం మిళితమైన పెందుర్తి రెవెన్యూలో పనిచేసేందుకు తహసీల్దార్ల నుంచి వీఆర్వోల వరకు ఆసక్తి కనబరుస్తారు. సాధారణ, రాజకీయ బదిలీల సమయంలో తొలి ప్రాధాన్యత పెందుర్తి మండలమే. ఏడాది క్రితం కూటమి అధికారం చేపట్టిన తొలి నాళ్లలో అయితే పెందుర్తికి వచ్చేందుకు కూటమి ముఖ్యనేతల వద్ద పైరవీల కోసం క్యూ కట్టారు.

అయితే కూటమి ముఖ్యనేతలు పొత్తు ధర్మాన్ని పక్కన పెట్టి తమ కార్యకర్తల 'శ్రేయస్సు' కోసమే పనిచేయడంతో యంత్రాంగంపై క్రమంగా ఒత్తిడి పెరుగుతూ వచ్చింది. సరిగ్గా ఏడాది తిరిగే సరికి వారి ఆధిపత్యపోరు తారస్థాయికి చేరుకోవడంతో అధికారుల పరిస్థితి ప్రాణ సంకటంగా మారుతోంది. ఎంతలా అంటే ఒకరు చెప్పిన పని చేస్తే మరొకరు అధికారులను 'బలి'పీఠం ఎక్కించేస్తున్నారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి మరీ అయితే బదిలీ వేటు.. లేదంటే శాఖాపరమైన విచారణ పేరిట చర్యలు తీసుకునేలా చేస్తున్నారు. దీంతో ఏడాది క్రితం ఎంతో ఆసక్తితో ఇక్కడకు వచ్చిన అధికారులు ఇక్కడి నుంచి ఎప్పుడు వెళ్లిపోదామా అన్నట్లు ఎదురు చూస్తున్నారు.

కమ్ టూ మై ఆఫీస్

కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో పెందుర్తిలోని ప్రభుత్వ భూముల దురాక్రమణకు గేట్లు ఎత్తేశారు. ఓ వైపు జనసేన.. మరోవైపు టీడీపీ.. సందట్లో సడేమియాలా బీజేపీ నేతలు సైతం ప్రభుత్వ భూములపై గద్దల్లా వాలిపోయారు. అయితే రోజురోజుకూ ముఖ్యనేతల మధ్య దూరం పెరుగుతూ రావడంతో క్షేత్రస్థాయిలో కూడా ఆయా పార్టీల కేడర్ మధ్య భూ కబ్జాలు, ఇతర పనుల విషయంలో వాటాల పంపకాలు బెడికొట్టడం తరచూ జరుగుతోంది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో ఓ పార్టీ నాయకుల కబ్జాకు సహరిస్తే మరో పార్టీ నాయకులు అధికారులను బెదిరిస్తున్నారు. 'కమ్ టూ సర్ ఆఫీస్'అంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆయా వ్యవహారాల్లో యంత్రాంగం జనసేనకు సహకరిస్తే టీడీపీ కార్యాలయానికి వెళ్లి చీవాట్లు, టీడీపీకి సహకరిస్తే జనసేన కార్యాలయంలో అందరి ముందే అక్షింతలు వేసుకోవాల్సిన దీనస్థితి. ఈ అవమానాలు భరించే కంటే మరోచోటుకి వెళ్లి ప్రశాంతంగా పనిచేసుకునే అవకాశం రావాలని బాధిత అధికారులు కోరుకుంటున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



సహస్రనామార్చనలో అర్చకుడు



మాంగళ్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి సహస్రనామార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 1001 నామాలతో స్వామికి సహస్రనామార్చన జరిపి, ఉభయదాతలకు స్వామివారి తులసి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, శేషవస్త్రం, ప్రసాదం అందించారు.

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు

- ప్రజలతో సిబ్బంది స్నేహపూర్వకంగా మెలగాలి
- జోన్–2 డీసీపీ మేరీ ప్రశాంతి



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ మేరీ ప్రశాంతి

పెందుర్తి: నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు జోన్–2 డీసీపీ మేరీ ప్రశాంతి అన్నారు. గంజాయి నిర్మూలనలో భాగంగా గంజాయి అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నామన్నారు. పెందుర్తి సర్కిల్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను మంగళవారం ఆమె పరిశీలించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సిబ్బంది స్నేహపూర్వకంగా వ్యవహరించి, సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సీఐ కేవీ సతీష్‌కుమార్, ఎస్‌ఐలు స్వామినాయుడు, ఎన్‌వీ భాస్కరరావు, దేముడుబాబు, సిబ్బంది, పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

4 తులాల బంగారం, రూ.50 వేల నగదు అపహరణ



బాధితుడి నుంచి వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు

పరవాడ: స్థానిక సినిమాహాలు కూడలికి చెందిన పైల వెంకటరావు ఇంట్లో మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 4 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరించుకుపోయినట్లు బాధితుడు పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలు. సినిమాహాలు జంక్షన్‌లో గ్రూప్‌హౌస్‌లో నివసిస్తున్న వెంకటరావు కుటుంబ సభ్యులు మంగళవారం మధ్యాహ్నం పొలం పనికి వెళ్లిపోయారు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, సీఐ మల్లికార్జునరావు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 6.15 మధ్య చోరీ జరిగి ఉంటుందని చెప్తున్నారు. బీరువా తాళాలు పగులగొట్టి లోపల భద్రపరిచిన రూ.50 వేల నగదు, 3 తులాల నల్లపూసలు, రెండు బంగారు ఉంగరాలు(తులం) అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు. క్లూస్ టీం రంగంలోకి దిగి వేలిముద్రలను సేకరించింది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

'తాడి తరలింపునకు సహకరించండి'



తహసీల్దార్‌ను కలిసిన తాడి గ్రామ పెద్దలు

పరవాడ: కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామ తరలింపునకు అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని పరవాడ మాజీ ఎంపీపీ మాధంశెట్టి నీలబాబు, గ్రామ పెద్దలు కోరారు. పరవాడ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజును మంగళవారం వారు మర్యాదపూర్వకంగా కలిసి, తమ సమస్యలను విన్నవించారు. ఏళ్ల తరబడి పరిశ్రమల కాలుష్యంలో చిక్కుకుని సతమతమవుతున్నామని వివరించారు. గ్రామ తరలింపులో రెవెన్యూ పరంగా తమకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో మాజీ సర్పంచ్ బొడ్డపల్లి అప్పారావు, జి.కనకరాజు, డి.నీలకంఠరావు, జి.నాగరాజు, కోమటి సూరిబాబు, అచ్చిబాబు, పైడిరాజు, పడమటయ్య, రమణ, సూరి అప్పారావు, రాము ఉన్నారు.

బావిలో గుర్తు తెలియని మృతదేహం



ఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: మండలంలో అక్కిరెడ్డిపాలెం జాతీయ రహదారి సమీపంలోని ఓ బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుని వయసు దాదాపు 30 ఏళ్లు ఉండవచ్చు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. వివరాలు తెలిసినవారు తమను సంప్రదించాలని కోరారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా గొర్లె రామునాయుడు

పెందుర్తి: అనకాపల్లి జిల్లా భారతీయ జనతా పార్టీ కార్యదర్శిగా ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

కల్తీ మద్యం దోషులపై చట్టపరమైన చర్యలు

పరవాడ: స్థానికంగా వెలుగు చూసిన కల్తీ మద్యంతో సంబంధం ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సంబంధిత అధికారులను సూచించారు. పరవాడలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కల్తీ మద్యం కేసుపై ప్రజల అపోహలను తొలగించాల్సిన బాధ్యత ఎక్సైజ్, పోలీస్ అధికారులపై ఉందన్నారు. నాలుగైదు రోజుల్లో పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి, నిజానిజాలను నిగ్గు తేల్చి చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను సూచించారు. లేకుంటే ప్రభుత్వానికి లేఖ రాసి తదుపరి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పాదాలమ్మ, బంగారమ్మ పండగ



అమ్మవారి ఘటాల గుడివద్ద దేవస్థానం తరపున నూతన వస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు



కోలాటం ఆడుతున్న చిన్నారులు



విష్ణుమూర్తి, కృష్ణుడు, నారదుడు, ఆంజనేయస్వామి వేషధారణల్లో గిరిజనులు, నివాసితులు

- మొక్కులు చెల్లించుకున్న గిరిజనులు, నిర్వాసితులు
- రాత్రి భారీ ఎత్తున అనుపు మహోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సింహాచలం: సింహగిరి గ్రామ దేవతలు పాదాలమ్మ, బంగారమ్మ ఆలయ వార్షిక పండగ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. గిరిజనులు, సింహగిరి నిర్వాసితులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి ఘటాల గుడివద్ద, ఆలయాల వద్ద పూజలు నిర్వహించారు. పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని భారీ జనసందోహం మధ్య నిర్వహించారు. అమ్మవారి ఘటాల గుడి నుంచి ప్రారంభమైన అనుపు మహోత్సవం సింహగిరి మాడ వీధి, మార్కెట్ ఏరియా మీదుగా ఆలయాల వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పులివేషాలు, కాళీ నృత్యాలు, కోలాటం విశేషంగా ఆకట్టుకున్నాయి. సింహగిరి గిరిజనులు, నివాసితులు విష్ణుమూర్తి, రాముడు, కృష్ణుడు, ఆంజనేయస్వామి, నారదుడు తదితర వేషధారణల్లో అలరించారు. సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవస్థానం తరపున ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు అమ్మవార్లకు పసుపు కుంకుమలు, చీరలు అందించారు. ఆలయం వద్ద సింహగిరి వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దాసరి పైడిరాజు ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అమ్మవార్ల పండగను పురస్కరించుకుని మధ్యాహ్నం 2.30 గంటల వరకే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనాలను భక్తులకు దేవస్థానం కల్పించింది. అనంతరం స్వామికి రాత్రి ఆరాధన, పవళింపు సేవ అనంతరం ఆలయ కవాట బంధనం చేశారు.

ఎరువుల యాజమాన్య పద్ధతితో అధిక దిగుబడులు



రైతులకు ఎరువుల వినియోగంపై సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ సుబ్రహ్మణ్యం

పరవాడ: మండలంలోనికలపాక శివారు స్వయంభూవరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ఏడీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వరిలో ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. పచ్చిరొట్ట ఎరువు ప్రాధాన్యత, కాలిబాటల ప్రయోజనాలు, జీవన ఎరువుల ప్రాముఖ్యత, సుడిదోమ, వరి ఆకుమడి దశలో చీడపీడల నివారణకు సూచనలు చేశారు. 5 ఎంఎల్ వేప నూనె, కార్బండిజమ్, మాంకోజెల్ కలిపి ఉన్న 2 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి ఆకుమడిపై చల్లడం ద్వారా చీడపీడలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం ఏవో విజేత, ఏఈవో శ్రీను, మండల వ్యవసాయాధికారి ఎం.రమాదేవి, ఏఈవో మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

అగనంపూడి: అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉక్కు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్టు అధ్యక్ష, కార్యదర్శులు జి.బోసుబాబు, బి.భాస్కరరాజు, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గుదే సుశీలా గజేంద్రరావు, ఐ.రాము నాయుడు తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వీఎంఆర్ షాపింగ్ మాల్ వెనుక ఉన్న విజయా వెలన్సీ ఫంక్షన్ హాలులో ఉచిత పరీక్షలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉక్కు, ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు శిబిరాన్ని సద్వినియోగ పరచుకోవాలని వారు కోరారు.

అడుగంటుతున్న రైతుల ఆశలు

- వర్షాల్లేక ఎండిపోతున్న చెరువులు
- ఆందోళనలో పరవాడ మండల రైతులు



చుక్క నీరు చేరని పరవాడ ఊర చెరువు



నీరు లేని వాడచీపురుపల్లి ఊర చెరువు



చుక్క నీరు లేని రావాడ కోనప్ప చెరువు

పరవాడ: వరుణుడి కరుణ కోసం పరవాడ ప్రాంత రైతాంగం ఎదురు చూస్తోంది. గత నెల రోజుల నుంచి సరైన వర్షాల్లేక మండలంలోని వాడచీపురుపల్లి, పరవాడ, భర్నికం, రావాడ, నాయుడుపాలెం ప్రాంతాల్లోని చెరువులు దాదాపుగా ఎండిపోయి కనిపిస్తున్నాయి. ఈ ఏడాది తొలకరి ముందుగా రావడంతో ఖరీఫ్ సీజన్ ఆశాజనకంగా ఉంటుందని ఆశించిన రైతాంగానికి ప్రస్తుత పరిస్థితులు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. కొన్ని రోజులుగా వాన జాడ లేకపోగా విపరీతంగా ఎండలు మండుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే వర్షాలు ముఖం చాటేయడంతో వరి పంటలు సాగు చేసే రైతుల్లో ఆందోళన మొదలైంది. అల్పపీడన ప్రభావంతో తొలకరిలో కురిసిన వర్షాలకు మండలంలో అక్కడక్కడ వరి నారు వేశారు. చెరువుల్లో నీరు లేకపోయినా వర్షాలపై ఆశలు పెట్టుకుని రైతులు నారు మళ్లను సిద్ధం చేసుకున్నారు. ఇటీవలి మండుతున్న ఎండలకు వరి నారు మళ్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరి సాగు.. వర్షాధారం

మండలంలో వరి సాగు చాలా వరకు వర్షాధారమే. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 340 ఎకరాల విస్తీర్ణంలో రైతాంగం వరి సాగు చేస్తున్నారు. వానలు ముఖం చాటేయడంతో చెరువుల్లో నీరు అడుగంటింది. గతేడాది ఈ సమయానికి చెరువులన్నీ నిండుకుండల్ని తలపించేవి. పరవాడ, భర్నికం పెద్ద చెరువులు, ఊర చెరువుల కింద సుమారు 270 ఎకరాల్లో వరి పంటలు సాగవుతుండగా.. రావాడ, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం చెరువుల కింద 70 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

వరి నాట్లకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షాలు కురవకపోవడంతో మండల రైతాంగం దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

చుక్క నీరు లేని కోనప్ప చెరువు

రావాడ గ్రామ పంచాయతీలో కోనప్ప చెరువు కింద సుమారు 120 ఎకరాల ఆయకట్టు ఉంది. దీనిలో దాదాపు 60 ఎకరాల్లో రైతులు వరి పంట సాగుకు సన్నాహాలు చేసుకున్నారు. వర్షాధార ప్రాంతం కావడంతో రైతులు కోనప్ప చెరువును నమ్ముకు ఆకుమడులు వేశారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చెరువులో చుక్క నీరు చేరలేదు. దీంతో రైతులు దిక్కు తోచని స్థితిలో వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఆకుమడులను కొందరు రైతులు బోర్ల సాయంతో ఎండిపోకుండా కాపాడుకుంటున్నారు.